
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 31 జూలై 2024



బీబీ ఫాతిమా తుదిదర్శనం



అనంతపురం ఐదో రోడ్డులో బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజున అమ్మవారి తుదిదర్శనం కల్పించారు. అనంతరం పెట్టెకు చదివింపులు చేసి, పీర్ల మకానానికి చేర్చారు. భక్తులకు రాత్రి అన్నదానం చేశారు.
-అనంతపురం కల్చరల్

అడవిలా ఆయకట్టు



ముళ్ల పొదలతో నిండిన ఆయకట్టు భూములు

లోకేశ్ దృష్టికి సమస్య..



తిమ్మరాయల చెరువు సమస్యను మంత్రి నారా లోకేశ్‌కు దృష్టికి తీసుకెళ్లాం. సలకంచెరువుకు ఆయన పాదయాత్రగా వచ్చినప్పుడు చెరువుకు నీరిప్పించాలని కోరాం. శింగనమల ఫీడర్ చానల్, మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువకు ఆధునికీకరణతో చెరువుకు నీరు చేరుతుందని వివరించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, గ్రామస్థుల సమక్షంలో అప్పట్లో లోకేశ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని ఆయనకు ఇంకోసారి గుర్తు చేస్తాం.
- ముత్యాల లక్ష్మీదేవమ్మ, మాజీ ఎంపీపీ

ప్రభుత్వం చొరవ చూపాలి..



జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలకు వాటా నీటిని ప్రభుత్వం అందించాలి. రైతులకు న్యాయం చేయాలి. శింగనమల నియోజకవర్గంలోని సాగునీటి కాలువల ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే రైతుల అభివృద్ధికి కృషి చేయాలి.
- చిన్నప్పయాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

నిధులు తేవాలి..



మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువ, ఫీడర్ చానల్ శిథిలావస్థకు చేరాయి. చివరి ఆయకట్టుకు నీరు చేరడం లేదు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని.. ఆధునికీకరణ పనులకు నిధులను తెప్పించాలి. పనులు పూర్తి చేయించి.. ప్రతి ఎకరానికీ సాగునీరు అందించాలి.
- మధుయాదవ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు

శింగనమల, జూలై 30: చెరువులో నీరుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. ఆయకట్టు సాగవుతుంది. పశు పక్షాదులకు తాగునీరు అందుతుంది. చెరువు చుట్టుపక్కల ప్రాంతాలు కళకళలాడుతాయి. చెరువులో నీరుంటే.. ఇంట్లో సంపద ఉన్నట్లే..! జిల్లాలో విజయనగర రాజుల కాలంలో నిర్మితమైన చెరువులు వందల సంఖ్యలో ఉన్నాయి. కానీ అవన్నీ ప్రాభవం కోల్పోతున్నాయి. నీరొచ్చే మార్గాలతోపాటు చెరువుల ఆక్రమణలు పెరిగిపోయాయి. దీనికి పాలకులు, అధికారుల నిర్లక్ష్యం తోడైంది. ఫలితంగా చెరువులు ముళ్ల పొదలతో చిట్టడవులను తలపిస్తున్నాయి. అలాంటి వాటిలో ఒకటి.. శింగనమల మండలంలోని సలకంచెరువు గ్రామ సమీపంలో ఉన్న తిమ్మరాయల చెరువు. ఐదొందల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువుకు ఏకంగా 50 ఏళ్ల నుంచి నీరు చేరడం లేదు. ఈ చెరువులో నీరుంటే నాయనవారిపల్లి, చిన్న మట్లగొంది, పెద్ద మట్లగొంది, సోదనపల్లి, ఈస్టు నరసాపురం, సలకంచెరువు, చీలేపల్లి, రాచేపల్లి, ఇరువెందల, ఆనందరావుపేట, నిదనవాడ, బందార్లపల్లి గ్రామాల పరిధిలోని వ్యవసాయ బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంటుంది. కానీ ప్రస్తుతం చుక్కనీరు లేదు. ఈ చెరువుకు వర్షపు నీటితోపాటు శింగనమల చెరువు నుంచి, మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువ నుంచి నీరు చేరేలా ఏర్పాట్లు చేశారు. కానీ అమలు కావడం లేదు. ఫలితంగా చెరువు ఎండిపోయి.. బోరు బావులు ఎండిపోతున్నాయి.

50 ఏళ్లుగా చేరని నీరు
ఫీడర్ చానల్‌లో ముళ్ల పొదలు
శిథిలమైన మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువ
ప్రాభవం కోల్పోయిన తిమ్మరాయల చెరువు
నీరుంటే.. ఇక్కడి రైతే రాజు అంటున్న స్థానికులు



శింగనమల చెరువు నుంచి తిమ్మరాయల చెరువుకు నీరందించే ఫీడర్ చానల్ దుస్థితి

రూ.40 లక్షలు వృథా

తిమ్మరాయల చెరువుకు శింగనమల చెరువు నుంచి 6 కి.మీ. ఫీడర్ చానల్ ద్వారా నీరు చేరాల్సి ఉంది. శింగనమల చెరువ నిండిన వెంటనే ఫీడర్ చానల్‌కు నీరు వదిలేవారు. కాలువ పూడిపోవడంతో 1997లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. అప్పట్లోనే రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేశారు. కానీ నీరు రాలేదు. దీంతో కాలువలో ముళ్ల పొదలు పెరిగి.. పూడిపోయింది. మూడేళ్ల క్రితం శింగనమల చెరువు నిండి.. నాలుగు నెలల పాటు మరువ పారింది. ఫీడర్ చానల్ పూడిపోవడంతో నీరు వృథాగా వంకల వెంబడి పారింది. కానీ తిమ్మరాయల చెరువుకు చుక్కనీరు చేరలేదు. మిడ్ పెన్నార్ 5వ దక్షిణ కాలువ చివరి ఆయకట్టు తరువాత.. తిమ్మరాయల చెరువుకు నీరు చేరాల్సి ఉంది. కానీ ఈ కాలువకు చివరిసారిగా 55 ఏళ్ల క్రితం నీరొచ్చిందని స్థానికులు అంటున్నారు. ఈ కాలువకు తరిమెల వరకు మాత్రమే నీరు వస్తోంది. చివరి ఆయకట్టు బీడుగా మారింది. ఇక చెరువుకు నీటి సంగతి చెప్పాల్సిన పనేలేదు. తరిమెల నుంచి 10 కి.మీ. మేర కాలువ ధ్వంసమైంది. ఆధునికీకరణ పనులు చేపట్టి.. చివరి ఆయకట్టుకు, చెరువుకు నీటిని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరొచ్చినా అన్నం పెట్టేటోళ్లం..

మా ఊరిలో మాది భూస్వాముల కుటుంబం. చెరువు కింద ప్రతి సంవత్సరం మూడు పంటలు పండేవి. మా ఇల్లు ధాన్యంతో కళకళలాడేది. మా ఇంటి వద్దకు ఎవరొచ్చినా కడుపు నిండా అన్నం పెట్టి పంపేవాళ్లం. కానీ 50 సంవత్సరాలుగా చెరువులోనికి నీరు రాలేదు. బోర్లలో నీరు తగ్గిపోయింది. అప్పులు చేసి బోర్లు వేయించినా నీరు పడటంలేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. చాలా మంది రైతులు భూములు అమ్మి అప్పులు చెల్లించారు. అప్పట్లో పదిమందికి అన్నం పెట్టిన రైతులు ఇప్పుడు ఆకలితో అలమటించాల్సి వస్తోంది. బతుకు భారంగా మారింది.
- రాఘవరెడ్డి, సలకంచెరువు



పనులు లేకపోవడంతో రచ్చకట్ట మీద కూర్చున్న సలకంచెరువు రైతులు



చుక్కనీరు లేని తిమ్మరాయల చెరువు

బతికుండగా చూస్తానో.. లేదో..



నాకు 75 ఏళ్లు. నా చిన్నతనంలో మా చెరువు కింద మూడు పంటలు పండేవి. వర్షాలు లేక 50 ఏళ్ల నుంచి చెరువులోకి నీరు రాలేదు. మా చెరువుకు రెండు మార్గాల నుంచి వచ్చే నీరు కూడా రావడం లేదు. నేను బతికుండగా చెరువులోకి నీరు వస్తుందో రాదో తెలియదు. మా చెరువులో నీరుంటే 10 గ్రామాల్లో రైతులు రాజుల్లా బతుకుతారు.
- చంద్రాయుడు, సలకంచెరువు

నీరేదీ..?



శింగనమల చెరువు నుంచి మా చెరువుకు నీరు చేరేందుకు 6 కి.మీ. ఫీడర్ చానల్ ఉంది. నాకు గుర్తుండి.. 60 ఏళ్లుగా కాలువలో నీరు పారలేదు. ఈ కాలువలో నీరు పారితే నాలుగు గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రస్తుతం 500 నుంచి 600 అడుగుల లోతు వరకూ బోర్లు వేసినా చుక్కనీరు పడటం లేదు. మా భూములు బీడు పడ్డాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు మాకు నీరు ఇచ్చి ఆదుకోవాలి.
- వీరయ్య, పెద్దమట్లగొంది

బోర్ల కోసం అప్పులు..



చెరువులో నీరుంటే బోరుబావుల్లో పుష్కలంగా నీరుంటుంది. వర్షాలు రాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. తోట పంటలు సాగు చేయడానికి 500 నుంచి 600 అడుగుల లోతు వరకూ బోర్లు వేయిస్తున్నాం. ఒకటి ఒకటిన్నర ఇంచు నీరు వచ్చి.. ఏడాదిలోపే ఎండిపోతున్నాయి. పంటలను బతికించుకునేందుకు అప్పుచేసి మళ్లీ బోర్లు వేయిస్తున్నాం. మా నీటి వాటను ప్రజాపతినిధులు తీసుకుని రావాలి. అప్పుడే రైతుల జీవితాలు బాగుపడతాయి.
-తిరుపాలు, సలకంచెరువు

కలెక్టరేట్‌లో కసరత్తు

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు
నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశం
కొత్త నిబంధనలతో పాత స్థానాలకు దూరం



కలెక్టరేట్



కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూలై 30: ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు అందరూ జిల్లాకు తిరిగొచ్చారు. జిల్లా నుంచి మొత్తం 39 మంది రాయలసీమలోని ఇతర జిల్లాలకు వెళ్లగా.. అందరూ అక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. వారిలో ఇద్దరు శ్రీసత్యసాయి జిల్లాకు వెళ్లినట్లు సమాచారం. మరో ఇద్దరు రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నారని తెలిసింది. మిగిలిన 35 మందిలో 31 మందిని జిల్లాలోని మండలాలకు కేటాయిస్తారు. నలుగురిని కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలకు కేటాయిస్తారు. పొరుగు జిల్లాల నుంచి తిరిగొచ్చిన తహసీల్దార్లు కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేసుకున్నారు. వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మండల స్థాయిలో పాలక పార్టీలకు కీలక అధికారి తహసీల్దారు. మండల పరిధిలో రెవెన్యూ అంశాలన్నీ తహసీల్దారు చేతుల్లోనే ఉంటాయి. దీంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తమకు అనకూలమైన అధికారిని నియమించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తహసీల్దార్లు కూడా తమకు అనువైన మండలాలకు వెళ్లేందుకు సిఫార్సులు చేయించుకుంటున్నారు.

ఇకపై అలా కుదరదు..

సొంత జిల్లాకు వచ్చిన తహసీల్దార్లకు కొత్త నిబంధనలు షాక్ ఇచ్చేలా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే చాలామంది తహసీల్దార్లు కోరుకున్న ప్రాంతాలకు వచ్చేందుకు పైరవీలు జోరుగా సాగింది. ఎమ్మెల్యేలు వ్యతిరేకించినా.. స్థానిక నాయకులతో ఉన్న సత్సంబంధాలతో కోరుకున్న మండలాలకు వెళ్లాలని భావించారు. ఈ క్రమంలో కొందరు సిఫార్సు లేఖలను సంపాదించి ఉన్నతాధికారులకు అందజేశారని సమాచారం. కానీ వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వడం కుదరదని కొత్త ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికితోడు సొంత రెవెన్యూ డివిజన్‌లో కూడా పోస్టింగ్ ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నిబంధనల కారణంగా గత ప్రభుత్వంలో పనిచేసిన నియోజకవర్గాలకు, తమ సొంత రెవెన్యూ డివిజన్‌లకు తహసీల్దార్లు పోస్టింగ్ తెచ్చుకునే వీలు లేకుండా పోయింది.

ఈ రోజు పోస్టింగ్స్..?

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే తహసీల్దార్లను ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీల నాయకులు కోరుకుంటున్నట్లు తెలిసింది. ఎవరెవరిని ఎక్కడ నియమించడానికి వీలు లేదో తెలిపే జాబితాను కూడా జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు, తిరస్కరణల జాబితా కలెక్టరేట్‌కు చేరిందని చర్చ జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో రిపోర్ట్ చేసుకున్న తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చేందుకు కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ సిద్ధమయ్యారు. మండలాల కేటాయింపు మంగళవారం రాత్రికి పూర్తవుతుందని, బుధవారం ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇంకా రిపోర్ట్ చేసుకోనివారు ఉంటే.. వారు వచ్చిన తర్వాత పోస్టింగ్ ఇస్తారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్టాపింగ్

గుంతకల్లు, జూలై 30: గుంతకల్లు మీదుగా వెళ్లే కలబురగి-బెంగళూరు-కలబురగి వందేభారత్ (22231/32) ఎక్స్‌ప్రెస్‌కు యాద్గిర్ స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా స్టాపింగ్‌ను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3 నుంచి ఈ రైలు ఒక నిమిషం ఆగుతుందని పేర్కొన్నారు.

కదల బొమ్మాళీ..!

బదిలీ అయినా.. సీటు వీడని ఉద్యోగులు

ఏడీసీసీ బ్యాంకులో నిబంధనలు బేఖాతరు
పదేళ్లకుపైగా ప్రధాన కార్యాలయంలో తిష్ట



ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30: ఏడీసీసీ బ్యాంకులో ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులు బదిలీ చేసినా కదలడం లేదు. ఇక్కడి నుంచి కదిలే సమస్యే లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. బ్యాంకులో వివిధ స్థాయిలో పాతుకుపోయిన ఉద్యోగులను పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న జాయింట్ కలెక్టర్.. ఇటీవల బదిలీ చేశారు. వీరిలో అధికశాతం మంది పదేళ్లకు పైగా పాతుకుపోయిన వారే. ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏజీఎంగా పనిచేస్తున్న ప్రసన్నలక్ష్మిని కళ్యాణదుర్గం ప్రాంతీయ అధికారిగా, చీఫ్ మేనేజర్లుగా ఉన్న మనోహర్‌ను ధర్మవరానికి, అనంత పద్మనాభం పాతూరు బ్రాంచ్‌కు, డీకే దుర్గాప్రసాద్‌ను కదిరికి, అనీల్‌కుమార్ రెడ్డిని హిందూపురానికి బదిలీ చేశారు. అయితే, మరి కొంతమంది సీనియర్ అధికారులను బదిలీ చేయకుండా అలాగే ఉంచారనే విమర్శలు వస్తున్నాయి. పైగా బదిలీ అయిన అధికారులు ఇక్కడే ఉంటామని చెబుతున్నారు. గతంలో సీఈఓగా, జీఎంగా పనిచేసిన విజయచంద్రారెడ్డి హైదరాబాద్ శిక్షణా కేంద్రానికి బదిలీపై వెళ్లి.. మూడేళ్ల తరువాత తిరిగి వచ్చి డీజీఎంగా బాధ్యతలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఏడీసీసీ బ్యాంకులో బదిలీల తీరు విమర్శలకు తావిస్తోంది.

కొత్త డీజీఎం చేరికపై చర్చ

మూడేళ్ల క్రితం ఏడీసీసీ బ్యాంకు సీఈఓగా, జీఎంగా పనిచేసి.. హైదరాబాద్ సహకార ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి బదిలీపై వెళ్లిన విజయచంద్రారెడ్డి తిరిగి ఇక్కడికే వచ్చారు. ఆయన ఇటీవల డీజీఎంగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో బ్యాంకులో చర్చ మొదలైంది. ప్రస్తుతం సీఈఓగా ఉన్న అధికారి స్థానంలో చేరేందుకే ఆయన తిరిగి ఇక్కడికి వచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు రెండు డీజీఎం పోస్టులు ఉండేవి. ఆయన కోసం మూడో డీజీఎం పోస్టును సృష్టించారు. ఇప్పటికే అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. ఈ క్రమంలో మూడో డీజీఎం రావడంతో సమస్య తీవ్రమౌతుందని అంటున్నారు.

వర్గాలుగా ఉద్యోగులు

ఏడీసీసీ బ్యాంకులో ఉద్యోగులు వర్గాలుగా విడిపోయారు. మరోవైపు ఉద్యోగ సంఘాల ప్రభావంతో మనస్పర్థలు ఏర్పడుతున్నాయి. బ్యాంకు కోసం ఎంతో కష్టపడ్డామని, తమను బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచాలని ఉద్యోగ సంఘాల పేరుతో కొందరు ముందుకువస్తున్నారు. దీంతో బదిలీ అయిన ఉద్యోగులు రిలీవై వెళ్లకుండా అలాగే అంటి పెట్టుకున్నారు. దీంతో ఉద్యోగుల మధ్యే విభేదాలు తలెత్తుతున్నాయి. ఒకే చోట ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని పలు శాఖలలో డి-ఫారం పట్టాలకు రుణాలు ఇచ్చిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మూడేళ్లకు ఒకసారి కచ్చితంగా బదిలీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, అమలుకు నోచుకోవడం లేదు. ఒక బ్రాంచ్‌లో పనిచేసిన తరువాత తిరిగి అదే చోటుకు బదిలీ చేయకూడదనే నిబంధనను తుంగలో తొక్కేస్తున్నారు.

వెళ్లాల్సిందే..



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి హోదాలో జాయింట్ కలెక్టర్ ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జేసీ ఆదేశాల మేరకు బదిలీ అయిన ఉద్యోగులు కచ్చితంగా ఆయా స్థానాల్లో వెళ్లి చేరాల్సిందే. బదిలీ అంశంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పాలనలో పారదర్శకత కోసం మూడేళ్లకు ఒకసారి కచ్చితంగా బదిలీ చేయాలన్న నిబంధన అమలు చేయడం ఉత్తమం. జేసీ ఇచ్చిన బదిలీ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేస్తాం. బదిలీ అయిన ఉద్యోగులు ఆయా స్థానాల్లో చేరకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.
- సురేఖారాణి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ

సేవాఘడ్ అభివృద్ధికి కృషి: గుమ్మనూరు

గుత్తిరూరల్, జూలై 30: మండలంలోని చెర్లోపల్లి వద్ద వెలసిన సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయం(సేవాఘడ్) అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఆయన మంగళవారం సేవాఘడ్‌ను సందర్శించారు. సేవాలాల్ మహరాజ్ ట్రస్టు సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సంత్ సేవాలాల్, జగదాంబ దేవికి ఎమ్మెల్యే పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవ నాయక్ పూలమాలలు వేసి ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ చరిత్ర గురించి వివరించారు. ఎమ్మెల్యే సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, నారాయణ, సర్పంచులు భరత్, వెంకటేష్, టీడీపీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న గుమ్మనూరు జయరాం

చౌడేశ్వరి సేవకుడి మృతి

రెడ్డిపల్లి బోనాలలో విషాదం



బుక్కరాయసముద్రం, జూలై 30: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి బోనాల వేడుకలలో పాల్గొన్న సేవకుడు రామాంజనేయులు(49) సొమ్మసిల్లి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. చౌడేశ్వరి అమ్మవారికి కొన్నేళ్ల నుంచి రామాంజనేయులు, దోసయ్య అనే ఇద్దరు సేవలు అందిస్తున్నారు. ఉత్సవాలలో అమ్మవారిని స్తుతిస్తూ విన్యాసాలు చేస్తారు. ఛాతిపై కత్తులతో పొడుచుకుంటూ అమ్మవారికి రక్త తర్పణం చేస్తారు. గ్రామంలో బోనాల ఉత్సవం మంగళవారం జరిగింది. ఈ ఊరేగింపులో ఎప్పటిలాగే రక్త తర్పణం చేసిన రామాంజినేయులు.. నీరసించి.. ఇంటికి వెళ్లాడు. కాసేపటి తరువాత ఛాతి నొప్పి ఎక్కువగా ఉందని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వారు చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అమ్మవారి సేవకుడి మరణానికి కారణమేమిటో తెలుసుకునేందుకు పోస్టుమార్టం నిర్వహించాలని వైద్యులు చెప్పడంతో గ్రామస్థులు అంగీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందక ముందు అమ్మవారి వేడుకల్లో పాల్గొన్న రామాంజనేయులు

మంత్రి పయ్యావుల ప్రజాదర్బార్

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి కేశవ్

అనంతపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం ప్రజా దర్బారు నిర్వహించారు. వివిధ వర్గాల ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. సమస్యలను తెలిపేందుకు వచ్చిన నాయకులు, ప్రజలతో ఆయన నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను సావధానంగా విన్నారు. అక్కడికక్కడే పరిష్కరించలేని సమస్యలను సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ప్రజా దర్బారు నిర్వహించిన ఆయన.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో సుపరిపాలన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించే విషయంలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించామని అన్నారు. ఎలాంటి సమస్యకైనా సత్వర పరిష్కారం చూపాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఆ గురుతర బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందనే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నామని అన్నారు.

ఫ్యాక్షన్ లేకపోయినా నిర్లక్ష్యం తగదు

నేర సమీక్షలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జూలై 30: జిల్లాలో ఫ్యాక్షన్ ప్రభావం లేకపోయినా, నిర్లక్ష్యం చేయవద్దని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. డీపీఓలో మంగళవారం నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో తీవ్ర, సాధారణ నేరాల కేసుల పురోగతి గురించి స్టేషన్ల వారిగా సమీక్షించారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక నిఘా వేయాలని సూచించారు. తాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ఆదేశించారు. చెడునడత కలిగిన రౌడీషీటర్లు, కిరాయి హంతకులకు కౌన్సెలింగ్ నిర్వహించి, సత్ప్రవర్తనతో నడుచుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనుమానాస్పద మృతి కేసుల ఛేదింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. మిస్సింగ్, చీటింగ్ కేసుల పెండెన్సీని తగ్గించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తే నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతిభద్రతల పరిరక్షణ వీలవుతుందని అన్నారు. పోక్సో కేసుల ఛేదింపులో జాప్యం తగదని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా కృషి చేయాలని అన్నారు. స్టేషన్లకు వచ్చే పిటిషనర్లతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై లోతుగా దృష్టి పెట్టి, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, డీటీసీ వీరరాజు, డీఎస్పీలు ప్రతాప్, శ్రీనివాసులు, జనార్దన్‌నాయుడు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటే చాలు.. అన్నీ ఫ్రీ

- ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు
- బుక్కుల కోసం గతంలో నానా అవస్థలు
- కూటమి ప్రభుత్వ పాలనలో బ్యాగులు సైతం ఉచితం
- ఒక్కో విద్యార్థికి 12 నోట్ పుస్తకాలు పంపిణీ

అనంతపురం విద్య, జూలై 30: గత ప్రభుత్వాలు ఏవీ ఇవ్వని రీతిలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తోంది. వాటితోపాటు నోట్ పుస్తకాలు, బ్యాగులను సైతం అందిస్తోంది. దీంతో ఆయా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఇంటర్‌లో ఫస్ట్ ఇయర్‌లో 7807 మందికి, సెకెండ్ ఇయర్‌లో 6625 మందికి మొత్తంగా జిల్లాలో 14,432 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.


విద్యార్థులకు కిట్లు అందిస్తున్న డీవీఈఓ ఇతర అధికారులు

జిల్లాలో 14432 మందికి..

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఏపీ మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ కళాశాలల్లో చదివే ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ విద్యార్థులకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. ఇంటర్ మొదటి ఏడాదిలో 7807 మంది, రెండో ఏడాదిలో 6625 మంది ఉన్నారు. అనంతపురం మండలానికి 11,296 పుస్తకాలు, ఆత్మకూరు 956, బెళుగుప్ప 694, బొమ్మనహాళ్ 3272, బ్రహ్మసముద్రం 552, బుక్కరాయసముద్రం 155, డీ హీరేహాళ్ 666, గార్లదిన్నె 997, గుత్తి 3346, గుమ్మఘట్ట750, గుంతకల్లు1814, కళ్యాణదుర్గం 4480, కంబదూరు 562, కణేకల్లు 3597, కూడేరు 510, కుందుర్పి 1931, నార్పల 1731, పామిడి 3158, పెద్దపప్పూరు 684, పెద్దవడుగూరు 456, పుట్లూరుకు 1120, రాప్తాడుకు 1466, రాయదుర్గం 8247, శెట్టూరుకు 1204, శింగనమలకు 702, తాడిపత్రికి 2562, ఉరవకొండ 5250, వజ్రకరూరు 734, విడపనకల్లు 1093, యాడికి 1180, యల్లనూరుకు 1104 కిట్లు పంపిణీ చేశారు. అలాగే 75 కళాశాలల పరిధిలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు కూడా ఉచితంగా ఇవ్వనున్నారు. ఒక్కో విద్యార్థికి 12 నోట్ పుస్తకాలను అందిస్తారు. ఇందులో 6 రూల్డ్, 6 అన్ రూల్డ్ నోట్ పుస్తకాలు అందించనున్నారు. మొత్తంగా 1,73,184 నోట్ పుస్తకాలను అందించనున్నారు.

వేలాది విద్యార్థుల్లో ఆనందం

గతంలో జగన్ ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు కూడా అందించకుండా రాక్షసంగా వ్యవహరించింది. కొత్త ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుని వేలాది ఇంటర్ విద్యార్థులకు ఆనందం కలిగించింది. ఇప్పటి వరకూ పాఠశాల విద్యార్థులకు మాత్రమే విద్యా కానుక కిట్లు అందించేవారు. కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులకు ఆ పుస్తకాల కల తీర్చాలని అనుకుంది. ఈక్రమంలోనే విద్యార్థులకు ఉచితంగా బ్యాగు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తోం ది. పుస్తకాలు, బ్యాగు, నోట్ పుస్తకాల కోసం ఖర్చు చేసే వేల రూపాయలను ప్రభు త్వం మిగిల్చిందంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బుక్స్ కొనే బాధ తప్పింది..



కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌తో పాటు, టెక్స్, నోట్ బుక్కులు అందుతున్నాయి. జిల్లాలో మొదటి, రెండో ఏడాదిలో చదువుతున్న 14432 మంది విద్యార్థులకు ఈ ఏడాది టెక్స్ట్ బుక్స్ 66,269, నోట్ బుక్స్ 1.73 లక్షలు అందిస్తున్నారు. బుక్స్ కొనాల్సిన బాధ విద్యార్థులకు తప్పింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉచితంగా కిట్లు అందుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

\- వెంకటరమణ నాయక్, డీవీఈఓ, ఆర్ఐఓ.

గత ప్రభుత్వంలో పాత పుస్తకాలే గతి



గతంలో ఐదేళ్లు విద్యార్థులకు పాత పుస్తకాలే గతి. మా సీనియర్లను అడిగి బుక్కులు ఇప్పించుకునే వాళ్లం. అవి కూడా కొందరికే దక్కేవి. దీంతో మేము అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇస్తుండటంతో ఆనందంగా ఉంది.

\-ప్రియదర్శిని, బైపీసీ విద్యార్థిని, అనంతపురం

అన్నీ ఉచితంగా ఇస్తున్నారు..



ఈ ఏడాది విద్యార్థులకు అన్నీ ఉచితంగా ఇస్తున్నారు. నోట్ బుక్స్ సైతం 12 అంది స్తున్నారు. గత ప్రభుత్వం కనీసం పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేదు. పేద విద్యార్థులు పుస్తకాల కోసం పడని ఇబ్బందులు లేవు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం విద్యార్థులకు వీటిని అందించడం సంతోషంగా ఉంది.

\- సుజాతాబాయి, సెకెండ్ ఇయర్ విద్యార్థిని

కొనాల్సిన పనిలేదు



నేను ఫస్ట్ ఇయర్ చదివేటప్పుడు బుక్‌స్టాల్‌లో పుస్తకాలు కొన్నాం. పాఠ్యపుస్తకాలకే రూ. 600 పైగా ఖర్చు అయ్యింది. చాలా మంది విద్యార్థులు కొనలేని పరిస్థితి ఉంది. ఇప్పుడు ప్రభుత్వం ఉచితంగా నోట్ బుక్స్ టెక్స్ట్ బుక్స్‌తోపాటు బ్యాగ్ కూడా అందిస్తోంది. వేలాది విద్యార్థులకు బుక్స్ కొనాల్సిన భారం తగ్గింది.

\- పర్వీన్, సెకెండ్ ఇయర్ హెచ్ఈసీ విద్యార్థిని.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి

మంత్రి పయ్యావుల కేశవ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్, టీడీపీ నాయకులు, అధికారులు

మడకశిర/ రూరల్, జూలై 30: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గుండుమల పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం గుండుమలకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం పరిశీలించారు. హెలీప్యాడ్, ముఖ్యమంత్రి పాల్గొననున్న సభా వేదికలను పరిశీలించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్‌టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. ఈకార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఈవేదిక ఉత్తమమైనదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హంగు, ఆర్భాటాలు ఉండవ్..

ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొంటారని మంత్రి పయ్యావులకేశవ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చిన ఆయన గుండుమలలో విలేకరులతో మాట్లాడారు. సాదాసీదాగా ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేకుండా జన సామాన్యంతో మమేకమయ్యే విధంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. గ్రామాల్లో ఉన్న వివిధ రకాల సమస్యలను తెలుసుకొంటూ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు రూపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంతకు ముందులాగా ఆర్భాటంగా బస్సుల్లో, లారీల్లో ప్రజలను తరలించే కార్యక్రమానికి స్వస్తిచెప్పి ఎక్కడికి వెళతారో అక్కడి ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకొనే ప్రయత్నం చేస్తారన్నారు.

రేపు మధ్యాహ్నం రానున్న సీఎం చంద్రబాబు



పుట్టపర్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీసత్యసాయి జిల్లా పర్యాటన ఖరారైంది. ఆగస్టు1న మడకశిర మండలం గుండుమలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటన ముగించుకుని శ్రీశైలం సున్నిపెంట నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.45కి గుండుమల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 2.15కి హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన గుండుమలకు చేరుకుంటారు. 2.20కి గుండుమలలో ఇంటి వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అనంతరం మల్బరీ ప్లాంటేషన్ షెడ్‌ను సందర్శించి పట్టు రైతులతో మాట్లాడతారు. 3.20కి గుండుమలలో కరియమ్మదేవి దేవాలయాన్ని సందర్శించి 3.25 నుంచి 4.25 దాకా గ్రామ ప్రజలతో ప్రజావేదిక కార్యక్రమంలో ముఖాముఖీ నిర్వహిస్తారు. 4.25 గుండుమల నుంచి బయల్దేరి పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. 5.05కు ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్తారు.

పింఛన్ పంపిణీకి మండలానికో ప్రత్యేక అధికారి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఓబుళమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30: పింఛన్ల పంపిణీకి మండలానికో ప్రత్యేక అధికారిని నియమించినట్లు డీఆర్‌డీఏ వెలుగు పీడీ ఓబుళమ్మ తెలిపారు. తన చాంబర్‌లో ఏపీడీ ఈశ్వరయ్యతో కలిసి ఆమె మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఆగస్టు ఒకటి ఉదయం 6గంటల నుంచి ఇంటివద్దనే పింఛన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆయా గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది బుధవారం బ్యాంకుల్లో నగదు డ్రా చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. మండలానికి, మున్సిపాలిటీకి పింఛన్‌ల పంపిణీకి ప్రత్యేక అధికారిని నియమించామని, ఆయా మండల ఎంపీడీఓలు, ఆయా మున్సిపాలిటీ కమిషనర్లను సమన్వయం చేసుకుని పర్యవేక్షిస్తారని తెలిపారు. సమావేశంలో డీపీఎంలు రాధారాణి, ఎండీ సత్యనారాయణ, జిలాన్, మజ్జిగ సత్యనారాయణ, అబ్జుతుల్లా, రవీంద్రబాబు, జేడీఎం సూర్యనారాయణ, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి


పరేడ్‌ను పరిశీలిస్తున్న కమాండెంట్

అనంతపురం క్రైం,జూలై 30: ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని రాయలసీమ రీజియన్ ఇన్‌చార్జ్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లాలోని హోంగార్డులు మంగళవారం పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో కమాండెంట్ ముఖ్య అతిథిగా పాల్గొని పరేడ్ తనిఖీ చేశారు. అనంతరం హోంగార్డులను ఉద్దేశించి మాట్లాడారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండాలని, హోంగార్డులు దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవన్నారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలు, సాధక బాధకాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టండి

ఎమ్మెల్యే పరిటాల సునీత


ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పనులు చేయకుండా మొండికేసిన కాంట్రాక్టర్లతో పనులైనా చేయించండి లేకుంటే వారిని బ్లాక్‌లిస్టులో పెట్టండి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిలిచిపోయిన పనులు, తాగునీటి సమస్య ఇతరత్రా అంశాలపై సమీక్షించారు. నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మకూరు బీసీ కాలనీ, అనంతపురం నగర శివారు ప్రాంతాలు పాపంపేట, కక్కలపల్లి కాలనీ పంచాయతీల పరిధిలోని కాలనీల్లో తీవ్ర తాగునీటి సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వైసీపీ హయాంలో చేపట్టిన తాగునీటి పథకాలకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయన్నారు. ఆ నేపథ్యంలోనే తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. కూడేరు మండలం చోళసముద్రం గ్రామ పరిధిలో 1.2 కి.మీ, హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ క్రాస్ కోసం 200 మీటర్లు, ఎన్‌హెచ్ క్రాస్ కోసం 500 మీటర్లు, ఆత్మకూరు బైపాస్ క్రాస్ కోసం 100 మీటర్లు చొప్పున మొత్తం 2 కి.మీ పైపులైన్ పనులు ఆగిపోయాయన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, చోళసముద్రం గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి అక్కడ పెండింగ్‌లో ఉన్న 1.2 కి.మీ పైపులైన్ పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఆత్మకూరులో రోడ్లను ధ్వంసం చేసి నాసిరకంగా తాగునీటి పైపులైన్ పనులుచేపట్టి కొళాయిలు బిగించారన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు తెచ్చేలా ఒక ప్రత్యేక స్కీమ్‌ను తయారు చేయాలని ఆమె ఆదేశించారు. పెండింగ్ పనులకు నిధులు కోసం సీఎంతో పాటు జిల్లా కలెక్టర్‌ను కలిసి అడుగుతామన్నారు. ఉపాధి పథకం ద్వారా ప్రతి మండలంలో రూ. 3 కోట్లతో రోడ్లు వేసే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరై, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అతడి సోదరులు ముడుపుల కోసం ఆపిన 35 రోడ్ల పనులు ప్రారంభించాలని ఆదేశిం చారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఈ మల్లికార్జున, డీఈ రహేనవశీం, పంచాయతీ రాజ్ ఎస్ఈ కేఆర్ ప్రసాద్, డీఈలు రసూల్, రామచంద్రారెడ్డి, ఈఈ చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

18 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 30: జిల్లాలోని 18 మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా శింగనమలలో 13.8 మి.మీ వర్షపాతం నమోదైంది. గార్లదిన్నె 12.2, అనంతపురం 10.2, శెట్టూరు 8.4, కూడేరు 5.8, వజ్రకరూరు 5.2, నార్పల 4.6, బొమ్మనహాళ్ 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.8 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

చీనీ టన్ను రూ.16వేలు



అనంతపురం రూరల్, జూలై 30: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16,500లు, కనిష్ఠంగా రూ.2,500లు, సరాసరి రూ.11,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 680టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, జూలై 30: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 1550 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి 'ఓపెన్' అడ్మిషన్లు

అనంతపురం విద్య, జూలై 30: ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌కు సంబంధించి 2024-25 ఏడాదికి బుధవారం నుంచి అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్ల స్వీకరణకు ఓపెన్ డైరెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. పదో తరగతిలో చేరడానికి 14 ఏళ్లు నిండిన వారు, ఇంటర్‌లో చేరడానికి 10వ తరగతి పాసై 15 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. బుధవారం అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. ఆగస్టు 27లోపు ఆన్‌లైన్ అడ్మిషన్లకు చివరి గడువని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు చెల్లించడానికి ఆగస్టు 28వ తేదీ గడువని తెలిపారు. అక్టోబరు 4 వరకూ రూ.200 లేట్ ఫీజుతో ఆన్‌లైన్ అడ్మిషన్లు చేయవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను లేదా... సమీపంలోని ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్లను సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం, జూలై30: రానున్న ఐదు రోజుల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని రేకులకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. గాలులు గంటకు 12-16 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి:
విజయ్‌శంకర్‌బాబు, ప్రధాన శాస్త్రవేత్త


ఉమ్మడి జిల్లాలో కంది, వేరుశనగ, ఆముదం పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు సూచించారు. కంది పంటలో మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీలు, ఆముదంలో 60 సెం.మీ దూరం ఉండేటట్లు రైతులు చూసుకోవాలన్నారు. అంతర సేద్యము ద్వారా కలుపు నివారించుకోవాలని సూచించారు. రైతులు వర్షాధార వేరుశనగ పంటలో నీటి సంరక్షణ, సాళ్లను, తల్లి సాళ్లు లేదా గొడ్డు సాళ్లు ప్రతి 3.6 మీటర్లకు ఒకటి చొప్పున విత్తన సమయం లేదా విత్తిన 20-30 రోజులకు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఈ సాళ్లు వేయడం వలన బెట్ట సమయంలో పంటకు నీటి సంరక్షణకు ఉపయోగపడటమే గాక అధిక వర్షం కురిసినప్పుడు మురుగు నీరు పోయే కాలువలుగా ఉపయోగపడుతాయన్నారు. గత 20-25 రోజులుగా జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో రైతులు ఆగస్టు మాసంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలన్నారు. వర్షాధార ఎర్రనేలల్లో కంది, జొన్న, కొర్ర, సజ్జ, అలసంద, ఉలవ, ఆముదం, పెసర, అనుముల పంటలు వేసుకోవచ్చన్నారు. నల్లరేగడి నెలల్లో కంది, ఆముదం, పత్తి పంట, ఆగస్టు మొదటి వారం వరకు సాగు చేసుకోవచ్చునని సూచించారు.

సూపర్‌స్పెషాలిటీలో అరుదైన శస్త్రచికిత్స


కోలుకున్న ట్రాన్స్‌జెండర్‌తో వైద్య బృందం

అనంతపురం టౌన్, జూలై 30: ఓ ట్రాన్స్‌జెండర్‌కు అరుదైన శస్త్ర చికిత్స చేసి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ప్రాణాలు నిలిపారు. వివరాలను సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ భాస్కర్ మంగళవారం వెల్లడించారు. ఈనెల 25న అనంత సర్వజన ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో ఉరవకొండకు చెందిన స్వాతి అనే 40ఏళ్ల ట్రాన్స్‌జెండర్ తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఇటీవల కిందకు పడ్డానని అప్పటినుంచి కళ్లు తిరగడం తలతిరగడం, భరించలేక తలనొప్పితో ఇబ్బంది పడుతున్నానని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలతకు తెలిపారు. దీంతో వారు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి పంపించి న్యూరోసర్జరీ డాక్టర్లతో పరీక్షలు చేయించారు. తలకు తగిలిన గాయం వల్ల మెదడులో ఇరువైపులా రక్తస్రావం జరిగి ఒత్తిడి పెరగడంతో తలతిరగడం, తలనొప్పి వస్తున్నాయని గుర్తించారు. ఇది చాలా అరుదుగా సంభవిస్తుంటుందని, శస్త్ర చికిత్స చేయాలని, లేదంటే ప్రాణానికి ముప్పు ఉంటుందని, బయట చేయించుకుంటే రూ.ఆరు లక్షలు అవుతుందని డాక్టర్లు తెలిపారు. అంతఖర్చు భరించలేనని ట్రాన్స్‌జెండర్ చెప్పడంతో సూపర్‌స్పెషాలిటీ న్యూరోసర్జరీ హెచ్ఓడీ డాక్టర్ భాస్కర్, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కరబాబు, డాక్టర్ అచ్యుత్ అనస్థీషియా డాక్టర్లు రీనా, మధు తదితరులు ఈనెల 27న శస్త్ర చికిత్స చేశారు. అది విజయవంతం కావడంతో ఆమె ఆరోగ్యంగా కోలుకున్నారు. అరుదైన ఆపరేషన్ చేసి ఓట్రాన్స్ జెండర్ ప్రాణం కాపాడినందుకు సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జరీ విభాగం డాక్టర్లను సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు అభినందించారు.

టీబీ డ్యాంలో 101 టీఎంసీల నిల్వ


నీటితో తొణికిసలాడుతున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్, జూలై 30: తుంగభద్ర జలాశయంలో 101.890 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు మంగళవారం సాయంత్రం తెలిపారు. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లోని శివమొగ్గ, అగుంబే, శృంగేరి, చిక్కమంగళూరు వర్నాడు తదితర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఇన్‌ఫ్లో తగ్గింది. సోమవారం 1,31,179 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి 68,630 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో మొత్తం 33 క్రస్టుగేట్లలో 12 గేట్లు మాత్రమే రెండు అడుగులు మేర ఎత్తి 40,160 క్యూసెక్కులు తుంగభద్ర నదికి, 9553 క్యూసెక్కులు కాలువలకు విడుదల చేశారు. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 107.788 టీఎంసీలు ఉండగా మంగళవారం సాయంత్రానికి 1632.03 అడుగులతో 101.890 టీఎంసీల నీటి నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 1210 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

రేపటి నుంచి హంద్రీనీవాకు నీరు



అనంతపురం క్లాక్ టవర్, జూలై 30: హంద్రీనీవాకు ఆగస్టు ఒకటిన నీటి విడుదల చేయనున్నట్లు కేఆర్ఎంబీ ప్రకటించిందని జిల్లా జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. నీటి విడుదల కోసం జలవనరుల శాఖ జిల్లా సీఈ నాగరాజ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో 883అడుగుల మేర 204టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో మల్యాల నుంచి రెండు పంపుల ద్వారా కృష్ణా జలాలను హంద్రీనీవాకు విడుదల చేయనున్నారని తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లో మూడు లక్షల క్యూసెక్కులకుపైగా ఉందన్నారు. ఒకటిన మొదట మల్యాల నుంచి వెయ్యి క్యూసెక్కుల ప్రకారం హంద్రీనీవా కాలవకు నీరు వదలనున్నారని తెలిపారు. నీరు వదిలిన సమయం నుంచి ఐదురోజుల్లో కృష్ణా జలాలు జిల్లా సరిహద్దుల్లోకి చేరుతాయన్నారు. ఈ ఏడాది హంద్రీనీవాకు పూర్తి స్థాయి కేటాయింపులు 40టీఎంసీలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ఆర్థికశాఖ మంత్రి పయ్యావులకు కంప్యూటర్ ఆపరేటర్ల వినతి



మంత్రికి సమస్యలను విన్నవిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

అనంతపురం, సిటీ, జూలై 30: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మంత్రిని కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. పంచాయతీ రాజ్‌శాఖలో గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నా ఏలాంటి ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతోపాటు 16 నెలలుగా జీతాలు ఇవ్వ లేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలను మంజూరు చేయడంతో పాటు ఎంటీఎస్, టైంస్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారించే విధంగా కృషి చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

పీఆర్సీ వర్తింపజేయాలి: డ్వామా ఉద్యోగుల జేఏసీ

అనంతపురం క్లాక్‌టవర్: డ్వామా పరిధిలోని ఉపాధి, వాటర్‌షెడ్ పథకాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపచేయాలని డ్వామా జేఏసీ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ఆర్థికశాఖ మంత్రి నివాసంలో డ్వామా జేఏసీ నాయకులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డ్వామా జేఏసీ అధ్యక్ష, కార్యద ర్శులు రామాంజినేయులు, బాషా మాట్లాడుతూ సుమారు 18 సంవ త్సరాలుగా డ్వామా పరిధిలో ఉపాధి హామీ పథకం, వాటర్‌షెడ్‌లలో వేలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, అయితే ఇంతవరకు ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పీఆర్సీ వర్తింపచేయాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డ్వామా జేఏసీ నాయకులు విజయభాస్కర్, రఘునాథ రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు మంత్రిని కలసిన వారిలో ఉన్నారు.

ఆర్థికశాఖ మంత్రిని కలసిన ట్రైనీ డీఎస్పీలు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను పలువురు ట్రైనీ డీఎస్పీలు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని ట్రైనీ డీఎస్పీలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతగా పనిచేయండి

సచివాలయ ఉద్యోగులకు ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన



ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురంరూరల్, జూలై 30: ఉద్యోగులు బాధ్యతగా పనిచే యాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని రుద్రంపేట పంచాయతీ సచివాలయం-1ను ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరుశాతాన్ని పరిశీలించారు. ఫిర్యాదులు, సమస్యల పరిష్కరంపై ఆరా తీశారు. పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల్లో ఎక్కువగా పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటి పరిష్కారంలో నిర్ల క్ష్యంవహించరాదన్నారు. పని విషయంలో నిర్లక్ష్యంవహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

'సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి'

అనంతపురం అర్బన్: నగరపాలక సంస్థపై ఏర్పడిన అవినీతి మరకను చెరిపేసేలా పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మునిసిపల్ ఆర్డీ, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ వీవీవీఎస్ మూర్తికి సూచించారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మూర్తి కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచనలు చేశారు. పారిశుధ్యంపై రాజీ పడకుండా పనిచేయించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గాండ్ల కులస్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని గాండ్ల, గానిగ, కాపుతెలిక, తేళి, వాణి చెట్టియార్ కుల సంక్షేమ సంఘం సౌత్ ఇండియా అధ్యక్షుడు వెంకటరమణ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కోరారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

దళితుల భూసమస్యలను పరిష్కరించాలి

అనంతపురం సెంట్రల్: దళితుల భూహక్కులను పరిష్కరించాలని బీఎస్పీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కోరారు. ఈ సందర్భంగా నాయకులు నాగరాజు, హరిప్రసాద్ మాట్లాడుతూ.. బహుజనవర్గాల ప్రజలకు చెందిన భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. న్యాయం కోసం కలెక్టరేట్, రెవెన్యూ, కోర్టులు చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని వాపోయారు. ఇప్పటికైనా భూసమస్యలపై దృష్టిసారించి పరిష్కరించేందుకు కృషిచేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో నాయకులు జిలాన్‌బాషా, అబ్దుల్‌గఫూర్ పాల్గొన్నారు.

జ్ఞాపిక అందజేత

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్ జ్ఞాపికను అందజేశారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో అందజేశారు.

ఒంటరి మహిళలకు ఆర్థిక సాయం

అనంతపురం అర్బన్: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సతీమణి శ్రీలక్ష్మీ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఎన్నికల ప్రచారం సమయంలో స్థానిక ఉమానగర్‌కు చెందిన రోడ్డు ప్రమాద బాధితురాలు షాహీన్‌ను కలిశారు. రోడ్డు ప్రమాదంతో తమ కుటుంబ సభ్యులను కోల్పోవడంతోపాటు ఆమె వెన్నెముక దెబ్బతినడంతో మంచానికి పరిమితమైంది. అధికారంలోకి రాగానే పింఛన్ ఇప్పిస్తామని అప్పట్లో ఆమెకు హామీ ఇచ్చారు. కొత్త పింఛన్‌దారులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇంకా రాకపోవడంతో దగ్గుపాటి శ్రీలక్ష్మి రూ.10వేలను బాధితురాలికి పంపారు. మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు కాశీ విశ్వనాథ్, నాగరాజుల ద్వారా ఆమెకు డబ్బు అందజేశారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కుల అందజేత

అనంతపురం క్రైం, జూలై 30: జిల్లాలో ఇటీవల మృతి చెందిన ఏఆర్ ఎస్ఐ, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబాలకు కార్పస్ ఫండ్ కింద రూ.2లక్షల చెక్కులను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మంగళవారం అందజేశారు. జిల్లా ఏఆర్ విభాగంలో పని చేస్తున్న ఏఆర్ ఎస్ఐ హాజీపీరా, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు నాయక్ ఇటీవల మృతి చెందారు. హాజీపీరా భార్య వహీదా, శ్రీరాములు నాయక్ భార్య పూజకు కార్పస్ ఫండ్ కింద చెరో రూ.లక్ష ప్రకారం చెక్కులను ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ ఇందిర, బీ సూపరింటెండెంట్ ప్రసాద్, పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకరరెడ్డి, హరినాథ్, శ్రీనివాసుల నాయుడు, ఆనంద్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందరి దృష్టి అనంతపూర్ క్లబ్‌పైనే..

- ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- ఆగస్టు 15న పోలింగ్
- ఓటరు జాబితాపై అనుమానాలు
- వైసీపీ నేత ఆక్రమణలో ఓ గది
- అద్దెకూడా చెల్లించని వైనం
- ఖాళీ చేయించాలంటూ ఒత్తిడి



క్లబ్‌లో వైసీపీ నాయకుడు ఆక్రమించిన గది

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30: ఎన్నికల నోటిఫికేషన్ జారీచేయడంతో అందరి దృష్టి ప్రస్తుతం అనంతపూర్ క్లబ్‌పై పడింది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 3వతేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 4న నామినేషన్ల పరిశీలన, 5న నామినేషన్ల ఉపసంహరణ, 15న పోలింగ్ నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే ఎన్నికల అధికారిగా క్లబ్ సభ్యుడై ఉండాలనే నిబంధనకు విరుద్ధంగా సభ్యుడిగా లేని న్యాయవాది రామకుమార్, సభ్యుడిగా ఉన్న సూర్యనారాయణ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై సభ్యులు ఇప్పటికే ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా రెండేళ్లకు ఒకసారి జనవరి 26న క్లబ్ ఎన్నికలు నిర్వహించేవారు. కరోనా సమయంలో ఎన్నికల షెడ్యూల్‌ను మార్చారు. ఇదిలా ఉంటే వైసీపి నేత అద్దె చెల్లించకుండా క్లబ్‌లో ఓ గదిని ఆక్రమించుకున్న విషయాన్ని మెజార్టీ సభ్యులు చర్చకు తీసుకువస్తున్నారు.

ఓటరు జాబితాపై అనుమానాలు

ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా గెజిటెడ్ అధికారులు ఇందులో సాధారణ సభ్యులుగా ఉంటారు. కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, వ్యాపారులు ఇలా మిగిలిన వర్గాల వారు లైఫ్ మెంబర్లుగా ఉంటారు. సాధారణ సభ్యుల్లో 30శాతం మాత్రమే లైఫ్ మెంబర్లు ఉండాలి. అయితే ఇందుకు భిన్నంగా మెంబర్‌షిప్ రెన్యూవల్ చేసుకోలేదనే నెపంతో 1144మంది సాధారణ సభ్యుల్లో 800మందిని తొలగించారు. 344 మందిని ఓటర్ల జాబితాలో చేర్చారు. లైఫ్ మెంబర్లు ఇప్పటికే 537మంది ఉన్నారు. దీంతో ఓటర్ల జాబితాపై సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గదిని ఆక్రమించుకున్న వైసీపీ నేత

గత ఐదేళ్లుగా అనంతపూర్ క్లబ్‌లో ఓ గదిని వైసీపీ నేత ఆక్రమించుకున్నాడు. ఇప్పటి వరకు ఐదేళ్లలో ఒక్క పైసా అద్దె చెల్లించకుండా ఆవాసంగా మార్చుకున్నాడు. దీనిపై ఇప్పటికే క్లబ్ సభ్యులు సెక్రటరీ, కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం శూన్యం. గతంలో క్లబ్‌లో గదిని ఆక్రమించుకున్న వైసీపీ ది అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితాను తీసుకెళ్లి అక్కడి నుంచి తన కార్యకలాపాలు కొనసాగించారు. అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో టీడీపీ అనుకూల అభ్యర్థులను ఓడించేందుకు క్లబ్‌లో ఆక్రమించుకున్న గదిని ఉపయోగించారు. క్లబ్‌లో బార్ లేక పోయినా గదినే బార్‌గా మార్చారనే చర్చ క్లబ్ సభ్యుల్లోనే జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకు అధికారపార్టీకి చెందిన నేత అనే ఒక్క భావనతో క్లబ్ సభ్యులు ప్రశ్నించేందుకు ఎవరూ ముందుకురాలేదు. ఇప్పుడు సభ్యులే బహిరంగంగా గదిని ఖాళీ చేయాలని సెక్రటరీ ద్వారా ఒత్తిడి తీసుకువస్తున్నారు.

మాన్యం భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు

దేవదాయశాఖ ఉపకమిషనర్ గురుప్రసాద్



కాశీవిశ్వేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఉపకమిషనర్

అనంతపురం కల్చరల్, జూలై 30: దేవదాయ శాఖ మాన్యం భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని దేవదాయశాఖ రాయలసీమ జోన్ ఉపకమిషనర్ పట్టెం గురుప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం వచ్చిన ఆయన తొలుత మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో సకాలంలో లీజు చెల్లించని గుత్తేదారులనుంచి మాన్యం భూములకు ఏపీ దేవదాయ ధర్మాదాయశాఖ సవరణ చట్టం 36/202 ప్రకారం తక్షణమే రక్షణ కల్పించాలని, అదేవిధంగా ఖాళీగా ఉన్న భూములకు వెంటనే వేలం నిర్వహించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ భూములను గుర్తించి దీర్ఘకాలిక వేలం ప్రతిపాదనలను పంపాలని సంబంధిత ఈఓలకు ఆదేశించారు. కోర్టుకేసుల్లో ఉన్న భూములను ఎండోమెంట్ కోర్టు ఆర్డర్ల మేరకు కౌలుదారులనుంచి రిలీవ్ చేయాలని, కౌలు, గుత్త చెల్లించని గుత్తేదారులకు లీజ్ రద్దు నోటీసులు పంపి మాన్యాలను ఆలయ అధికారులు స్వాధీన పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు, నరసింహరాజు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కాశీవిశ్వేశ్వ రాలయ ఈఓ రమేష్‌బాబు, జిల్లాలోని వివిధ ఆలయాల ఈఓలు పాల్గొన్నారు.

200 పనిదినాలు కల్పించాలి

ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నాయకులు



డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కూలీలకు ఏటా 200 రోజుల పనిదినాలు, రూ.600 కనీస వేతనం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయం ఎదుట ఏపీ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరి, కృష్ణమూర్తి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని, జాబ్‌కార్డుదారులందరికీ ఉచిత బీమా సదుపాయం కల్పించాలన్నారు. రాజకీయ జోక్యం ఆపాలని, ఉపాధి పథకానికి బడ్జెట్‌లో రూ.2లక్షల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. 100 రోజులు పనులు పూర్తి చేసిన కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నూరు రోజులు ఉపాధి పనులు స్థానికంగా కల్పించి వలసలు నివారించాలన్నారు. అనంతరం డ్వామా పీడీ వేణు గోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు భాస్కర్‌బాబు, పెద్దయ్య, నాగభూషణ, లాజన్, నాగలింగయ్య, నారాయణస్వామి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై వెంటనే స్పందించండి

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నార్పల, జూలై 30: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా పనిచేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. నార్పల మండలంలో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని, ప్రతి గ్రామంలో తాగునీరు, వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఏ గ్రామం నుంచి కూడా తాగునీటి సమస్యపై వినతులు రాకుండా పనిచేయాలన్నారు. నార్పలలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని హెచ్ఎం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌కో ఏఈ మండలానికి లేరని ప్రజాప్రతినిధులు తెలుపగా నియమిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బాలుర, బాలికల వసతి గృహాల్లో మౌలిక వసతులతోపాటు మినరల్ వాటర్‌ను విద్యార్థులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ నాగేశ్వరరావు, జడ్పీటీసీ నాగరత్నమ్మ, డిప్యూటీతహసీల్దారు లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

'రైతులు అధిక దిగుబడులు సాధించాలి'

చెన్నేకొత్తపల్లి, జూలై 30: సేంద్రీయ రైతులు అధిక దిగుబడి సాధించి ఉత్పత్తులను మరింత పెంపొందించుకోవాలని టింబక్టు కలెక్టివ్ చైర్‌పర్సన్ మేరీవట మట్టం, సీకే గంగూలి సూచించారు. స్థానిక టింబక్టు కార్యాలయ ఆవరణంలో ధరణి సొసైటీ 16వ వార్షిక మహాసభను మంగళవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు అక్కులప్ప, సీఈఓ మహేశ్, ప్రోగ్రాం మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ, గంగూలీ మాట్లాడుతూ రైతులు పండించే పంటలు అధిక దిగుబడులు సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సమావేశంలో టింబక్టు కలెక్టివ్‌ప్రోగ్రాం మేనేజర్లు, కో ఆర్డినేటర్లు, సీఈఓలు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ కమిటీ ఎన్నిక

అనంతపురం సెంట్రల్, జూలై 30: ఏఐఎస్ఎఫ్ ఎస్కేయూ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు రమణ, కుళ్లాయి స్వామి తెలిపారు. అధ్యక్షుడిగా షైనుద్దీన్, ఉపాధ్యక్షులుగా మహేష్, శ్రీకాంత్, శ్రీనుతోపాటు 17మంది సభ్యులతో కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు.

జలధికి తరలిన పీర్లు

రామగిరి, జూలై 30: మండలంలోని కానుగులకుంట గ్రామంలో మంగళవారం పీర్లను జలధికి తరలించారు. దీంతో పీర్లపండుగ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయసంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

చెన్నేకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాలలో పీర్లు మంగళవారం జలధికి తరలాయి. బసంపల్లి, కనుముక్కల, మేడాపురం, న్యామద్దల, ముష్టికోవెల, గువ్వలగోవిందంపల్లి గ్రామాలలో పీర్లను ఊరేగించి అగ్నిగుండ ప్రవేశ అనంతరం జలధికి తరలించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

'జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మించండి'



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును కలిసిన నాయకులు

బుక్కరాయసముద్రం, జూలై 30: జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి జిల్లాకు ఎయిర్‌పోర్టు వస్తే అన్నిరకాల అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని టీడీపీ నేతలు తెలియజేశారు.

గంగమ్మకు బోనాల సమర్పణ



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

రామగిరి, జూలై 30: మండల కేంద్రమైన రామగిరిలో వెలసిన గంగమ్మకు భక్తులు మంగళవారం బోనాలు సమర్పించారు. దేవాలయ కమిటీ చైర్మన్ నారాయణ, సభ్యులు కటికి రామాంజినేయులు, పేపర్ శీన మనోహర్, అనిల్, హరి, నరేశ్, శివయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. భక్తులు బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా చౌడలమ్మ అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించారు.

'తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలి'



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30: తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్ మాట్లాడుతూ స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులు, కక్షసాధింపులు మానుకోవాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన పథకం, నేషనల్ హెల్త్‌మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, మెప్మా, డ్వామా, 108, 104 పథకాలలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం అమలు చేయాలన్నారు. తొలగించిన యానిమేటర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో పీడీ ఓబుళమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆటోబోల్తా.. విద్యార్థి మృతి

మరో ఇద్దరికి గాయాలు



ధనుష్

గార్లదిన్నె, జూలై 30: మండల కేంద్రంలోని శింగనమల క్రాస్ సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడి ధనుష్ (17) మృతి చెందాడు. శింగనమల మండలం గురుగుంట్ల గ్రామానికి చెందిన ఓబుళపతి కుమారుడు ధనుష్, భానుప్రకాష్, వెంకటేష్, ఎర్రిస్వామి, మురళి కూలిపని నిమిత్తం చీనీతోటలో పనిచేసేందుకు ఆటోలో గార్లదిన్నెకు వస్తున్నారు. శింగనమల క్రాస్ సమీపంలోకి రాగానే కుక్క అడ్డురావడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ధనుష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎర్రిస్వామి, డ్రైవర్ జనార్ధన్‌కి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన ధనుష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



శాకంబరిగా దర్శనమిస్తున్న లలితాదేవి

శాకంబరిగా లలితామాత

అనంతపురం కల్చరల్, జూలై 30: ఆషాఢ మంగళవారాన్ని పురస్కరించుకుని పాతూరు తిలక్‌రోడ్డు రామాలయంలో లలితాదేవి శాకంబరిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై దాడి

అనంతపురం క్రైం, జూలై 30: నగరంలోని గణేనాయక్ కాలనీలో తన స్నేహితునిపైనే దాడి చేశాడు. కాలనీకి చెందిన ఉమర్, షాషావలి స్నేహితులు. మంగళవారం ఇద్దరూ గొడవపడ్డారు. ఈ క్రమంలో ఉమర్ వైర్లు కట్ చేసే చాకుతో షాషావలిపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఉమర్‌పై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

- అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం త్రీటౌన్ పోలీసులు సీజ్ చేశారు. రాజీవ్‌కాలనీలో పట్టుకుని డ్రైవర్ తలారి నరేష్‌ను అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో నంద్యాల వాసి మృతి

అనంతపురం రూరల్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల వాసి మృతి చెందాడు. సోమవారం కళ్యాణదుర్గం నుంచి ఓ బొలెరో వాహనంలో టమోటాలు వేసుకుని నంద్యాలకు బయలుదేరారు. అనంతపురం రూరల్ కామారుపల్లి సమీపంలో వెనుక టైర్ ఊడిపోవడంతో బొలెరో బోల్తా పడింది. వాహనంలోని నంద్యాల జిల్లా సిరివెళ్ల గ్రామానికి చెందిన గౌస్‌పీరా (35) తీవ్రగాయాలకు గురి కావడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమిటీ ఎన్నిక

బుక్కరాయసముద్రం, జూలై 30: మండల రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడిగా కేకే అగ్రహారం గ్రామానికి చెందిన కనుమ నారాయణస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండలంలోని వివిధ కళాకారులు సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ గోవిందురెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, గోపాల్, సంజప్ప తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'సద్వినియోగం చేసుకోండి'

అనంతపురం రూరల్, జూలై 30: సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ సరుకులను సద్వినియోగం చేసుకోవాలని సీఎస్‌డీటీ శ్రీరాములు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రైతు బజారు, ప్రధాన మాల్స్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరుకులను అందించడం జరుగుతోందన్నారు. కందిబేడలు కిలో రూ.160, సోనామసూరి బియ్యం రూ.48తో ఇస్తున్నామని పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

బుక్కరాయసముద్రం, జూలై 30: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోదనపాటి కొండయ్య (65) మృతికి పలువురు నివాళులర్పించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలులో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, మండల కన్వీనర్ అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్ లక్ష్మినారాయణ, టీడీపీ నేతలు ఎస్‌నారాయణస్వామి, నరేంద్రయాదవ్, సురేష్‌చౌదరి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కార్యకర్త మృతి

అనంతపురం రూరల్: మండలంలోని అక్కంపల్లి పంచాయతీ ఎన్ఆర్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త ఆదినారాయణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు మృతదేహానికి నివాళులు అర్పించారు. అంజన్‌రెడ్డి, మస్తాన్, రాము, వన్నూరుస్వామి తదితరులు నివాళులు అర్పించారు.

'ప్రతిపక్ష హోదా అడగడం సిగ్గుచేటు'

అనంతపురం సెంట్రల్, జూలై 30: మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదా కావాలని అడుక్కోవడం సిగ్గుచేటని ఆర్‌ఈఎఫ్ రాయలసీమ అధ్యక్షుడు ఎంబీ నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. అనేకమంది ఉద్యోగులను పొట్టునపెట్టుకున్న పాపానికి జగన్‌కు ప్రతిపక్షహోదా లేకుండా ప్రజలు శిక్షించారన్నారు.

యూనిఫాం పంపిణీ

గార్లదిన్నె, జూలై 30: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం యూనిఫాంను మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్ అందజేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

గుంతకల్లుటౌన్, జూలై 30: పట్టణంలోని వీవీ నగర్‌లో వెలసిన వినాయక దేవాలయంలో మంగళవారం ఆడి కృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రదీప్ కుమార్‌శర్మ, రామచంద్రరావుశర్మ, ఉదయం ఆలయంలో వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ చేసి వేదికపై కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య సుబ్రహ్మణ్యేశ్వర స్వా మి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు, ఊంజల సేవ నిర్వహించారు.

2న బుగ్గరామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

తాడిపత్రి, జూలై 30: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 2వ తేదీన ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే రాజరాజేశ్వరీదేవికి శాకంబరీ అలంకరణ చేయనున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అమ్మవారి పంచలోహ విగ్రహానికి పంచామృతాభిషేకం, వినాయక పూజ, మండపారాధన, మహాన్యాస పారాయణం తదితర పూజా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

నేడు తుంగభద్ర జలాలకు ఎమ్మెల్యే పూజలు

బొమ్మనహాళ్, జూలై 30: మండలకేంద్రం సరిహద్దులోని 105 కి.మీ. వద్ద తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే ఎగువకాలువలో తుంగభద్ర జలాలకు బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పూజలు నిర్వహిస్తారని తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు సరిహద్దులోని హెచ్చెల్సీ కాలువ వద్దకు చేరుకుని పూజలు చేస్తారని తెలిపారు. మండలంలోని హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు, టీడీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఇళ్ల వద్దకే పింఛన్ : కమిషనర్

గుంతకల్లుటౌన్, జూలై 30: మున్సిపాలిటీ పరిధిలో గురువారం పింఛన్‌దారులకు ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది ద్వారా ఉదయం 6గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 12302 మంది లబ్ధిదారులకు రూ.5,348కోట్లు పంపిణీ చేస్తారని కమిషనర్ తెలిపారు.

నేడు మండల సమావేశం

బొమ్మనహాళ్, జూలై 30 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ పద్మ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, హాజరు కావాలన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు తెలిపారు.

రేషన్ పంపిణీలో ఫిర్యాదులొస్తే చర్యలు : సీఎస్‌డీటీ

యాడికి, జూలై 30: ఆగస్టు నెలకు సంబంధించి గురువారం నుంచి ప్రారంభమయ్యే రేషన్ పంపిణీని సక్రమంగా చేపట్టాలని సీఎస్‌డీటీ సూర్యనారాయణ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి లబ్ధిదారుడికి రేషన్ సరుకులు అందించాల్సిన బాధ్యత డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై ఉందన్నారు. ఫి ర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ ఆనంద్ బాబు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుంతకల్లు టౌన్, జూలై 30: పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త వాల్మీకి లక్ష్మీనారాయణ సతీమణి వాల్మీకి శ్రీలత కంటి ఆపరేషన్‌కు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మంగళవారం పట్టణంలోని స్వగృహంలో వారికి రూ.25వేలు అందజేశారు. కార్యక్ర మంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నా యకులు గుమ్మనూరు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు : సీడీపీఓ

బ్రహ్మసముద్రం, జూలై 30: అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం రెండు సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ... తల్లిపాల వారోత్సవాలను బుధవారం నుంచి ప్రతి కేంద్రంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఖాసిం బీ, రామాంజినమ్మ, బీపీసీ జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రాయదుర్గం రూరల్, జూలై 30: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ వీరేష్ తెలిపారు. కళాశాలలో మంగళవారం ఎంఈఓ వెంకటరమేష్ చేతుల మీదుగా మొత్తం 6339 నోటు పుస్తకా లు, 1038 మందికి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. కళాశాల ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు మంగళవారం ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 232 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 250 మందికి ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హనుమంతనాయక్, సీఎస్ రాయుడు, ఆదిరాముడు, శంకర్, లింగ, వరలక్ష్మి, స్వప్న, గంగిరెడ్డి, భూపతి, పుష్పరాజ్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

తప్పని సరిగా కౌలు హక్కు పత్రం పొందాలి : ఏఓ

గుంతకల్లు టౌన్, జూలై 30: కౌలు రైతులు తప్పని సరిగా కౌలు హక్కు పత్రాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి కే స్వాతి తెలిపారు. ఆమె మంగళవారం మం డలంలోని నాగసముద్రం, అయ్యవారిపల్లిలో గ్రామ సభలను నిర్వహించారు. అలాగే హరిత అనంత కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రైతులు టేకు, ఎర్రచందనం తదితర మొక్కలను నాటుకునేందుకు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వెంకటలక్ష్మి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

● విద్యార్థులకు కలెక్టర్ వినోద్ కుమార్ సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఉరవకొండ, జూలై 30: కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ విద్యార్థులకు సూచించారు. పట్టణ శివారులోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, హాస్టల్ గదులు, వంట గది, అధ్యాపకుల క్వాటర్స్‌ను పరిశీలించారు. ఇంటర్ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనమందించాలని, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రిన్సిపాల్ సునీతకు సూచించారు. ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలన్నారు. విద్యార్థినులతో స్పోర్ట్స్ ఆడించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఎడ్యుకేషనల్ సెక్టార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ, గిరిజన శాఖలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఆదర్శ పాఠశాలలు వాటి కిందకి వస్తాయన్నారు. ప్రతి నెల మొదటి మంగళవారం ఎడ్యుకేషనల్ సెక్టార్ బృందంతో సమీక్షిస్తామన్నారు. ఆగస్టు నెల నుంచి ఈ కార్యక్రమం మొదలవుతుందని, అన్ని చోట్ల అధ్యాపకుల అకడమిక్, స్పోర్ట్స్ తీరుపై సమీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులురెడ్డి, డీసీఓ మురళి కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎ హషాన్ బాషా, డీటీ హరిప్రసాద్, ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : కలెక్టర్

రాబోవు రోజుల్లో జిల్లాలో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నింబగల్లు సమీపంలోని సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌ను కలెక్టర్ మంగళవారం సాయంత్రం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎ హషాన్ బాషాతో కలిసి పరిశీలించారు. నీటి పంపింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. హెచ్చెల్సీకి నీరు రావడంతో పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంకు తాగునీటిని వదులుతున్నామన్నారు. చాగల్లు రిజర్వాయర్‌కు నీటిని తీసుకెళ్తామన్నారు. తుంగభద్ర ద్వారా జిల్లాకు రావా ల్సిన వాటా వచ్చే అవకాశముందని, 1.50లక్షల ఎకరాలకు సాగు నీరు ఇ స్తామన్నారు. కార్యక్రమంలో డీఈ షఫీన్, ఏఈ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించండి

ఆర్థిక మంత్రి కేశవ్‌కు విన్నవించిన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

పామిడి, జూలై 30 : విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు విన్నవించారు. వారు మంగళవారం అనంతపురం నగరంలోని మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాము విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పదేళ్లగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామన్నారు. కావున రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను తమకు ఇవ్వాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు నారాయణస్వామి, సుదర్శన్‌బాబు, అజయ్‌కుమార్, నాగరాజు, దేవేంద్రనాయక్, ఎర్రిస్వామి, కుమార్‌స్వామి, నారాయణరావు, ఇంద్రకుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఏ సమస్యా పరిష్కారం కావడం లేదు

సమావేశంలో ధ్వజమెత్తిన కౌన్సిలర్లు

గుత్తి, జూలై 30: వార్డులలో నెలకొన్న ఏ సమస్యా పరిష్కారం కావడం లేదని, అటువంటప్పు కౌన్సిల్ సమావేశాలు ఎందుకంటూ అధికారులపై కౌన్సిలర్లు మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన కమిషనర్ శ్రీనివాసుల సమక్షంలో మంగళవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజెండాలో పొందుపరిచిన 26 అంశాలను చదువుతుండగా కౌన్సిలర్లు అడ్డుకున్నారు. గత సమావేశంలో ఆజెండాలో తీర్మానం చేసిన అంశాల్లో ఏది పరిష్కరించారో తెలపాలని ప్రశ్నించారు. పలు వార్డులలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు స్పందిచడం లేదన్నారు. ఏడో వార్డులో రోడ్డు నిర్మించాలని ప్రతి సమావేశంలో కోరుతున్నా నేటికీ పట్టించుకోలేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని కమిషనర్‌ను ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన సమాధానకిచ్చారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తుల అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలి

జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి దుర్గాకల్యాణి



పోస్టరు విడుదల చేస్తున్న న్యాయాధికారి

ఉరవకొండ, జూలై 30: వ్యక్తుల అక్రమరవాణాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉరవకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధి కారి దుర్గాకల్యాణి సూచించారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో మంగళవారం వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. బడి బాట పడదాం, బాల్య వివాహాలకు ముగింపు పలుకుదాం అనే పోస్టర్లును న్యాయాధికారి విడుదల చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శివయ్య, ఆర్డీటీ ఏటీఎల్ నల్లపరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం : సీడీపీఓ

కుందుర్పి, జూలై 30 : బాల్య వివాహాల నిర్మూలించాలని, అది స్వచ్ఛంద సంస్థల సహకారంతో సాధ్యమని కంబదూరు సీడీపీఓ వనజ అక్కమ్మ, ఎంఈఓ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని వడ్డేపాళ్యం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ... బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నిస్తుంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 100, 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు ఆదిశేషు, చలమారెడ్డి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మరో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటుచేయండి'

తాడిపత్రి, జూలై 30: పట్టణంలోని 30వ వార్డులో అదనంగా మరో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని సీడీపీఓ సాజిదాబేగానికి టీడీపీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున మంగళవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 30వ వార్డులో దాదాపుగా 4500మంది జనాభా ఉన్నారన్నారు. ప్రస్తుతం ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకొని మరో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

రాయితీ సరుకుల పంపిణీకి ప్రత్యేక కౌంటర్

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూలై 30 : ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న నిత్యవసర సరుకుల పంపిణీకి మండల కేంద్రమైన శెట్టూరు లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రత్యేక కౌంటర్లో బియ్యం కిలో రూ. 49, కందిపప్పు రూ. 160కే విక్రయిస్తున్నట్లు తెలిపారు.

కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, జూలై 30: స్థానిక ఆర్టీసీ డిపోకు వచ్చిన మూడు కొత్త బస్సులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంగళవారం ప్రారంభించారు. డిపోకు కొత్తగా వచ్చిన గుంతకల్లు-తిరుపతి ఒక బస్సు, గుంతకల్లు-ఆదోని రెండు బస్సులను ఎమ్మెల్యే లాంఛనంగా రిబ్బన్ కత్తిరించి, జెండాను ఊపి ఆరంభించారు. ప్రయాణికుల డిమాండ్ల మేరకు ఆర్టీసీ వీటిని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో ఇన్చార్జి మేనేజరు బాలాజీ దయాళ్, సీనియర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టరు ఎస్కే నాయక్, టీడీపీ నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, గుజిరీ ఖాజా, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్, ఆటో ఖాజా, రామన్న చౌదరి, సర్పంచు శ్రీరావు, ఫజులు, ఫ్రూట్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి వినతులు: తమకు జీతాలు కాంట్రాక్టరు ద్వారా కాకుండా యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎమ్మెల్యే జయరాంను కోరారు. గుంతకల్లు-నాగసముద్రం-అనంతపురం బస్సును పునరుద్ధరించాలని దోనిముక్కల సర్పంచు శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యేకి విన్నవించారు.

భక్తులకు వసతులు కల్పించాలి : ఆర్డీఓ

గుంతకల్లు, జూలై 30: శ్రావణమాసం సందర్భంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాల సమస్య తలెత్తకుండా అన్ని శాఖలవారు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆయన మంగళవారం ఉదయం కసాపు రంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో వివిధ శాఖల సమన్వయ సమావేశాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఈఓ భద్రాజీ వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. శ్రావణ మాసంలో వచ్చే శని, మంగళవారాలలో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్య లో తరలివస్తారని, వారికి తాగునీరు, వసతి, వైద్య సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, పోలీసు భద్రత కల్పించాల్సిన అవసరముందన్నారు. అన్ని శాఖల సహకారం సంపూర్ణంగా లభిస్తేనే అది సాధ్యమవుతుందన్నారు. కావున అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవ కార్యక్రమాలను విజయవం తం చేద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కే సుగుణమ్మ, ఆలయ ఏఈఓ మల్లికార్జున, సూపరింటెండెంటు వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులుగా స్తంభించిన ఏపీజీబీ సేవలు

కళ్యాణదుర్గం (కంబదూరు), జూలై 30 : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) సేవలు రెండు రోజులుగా స్తంభించాయి. దీంతో ఏపీజీబీలో ఖాతా ఉండి ఆ ఖాతాను ఫోన్‌పే, గూగుల్‌పేకు లింక్ చేసుకున్న ఖాతాదారులందరూ రెండు రోజుల నుంచి ఇబ్బందులకు గురవుతున్నారు. నెట్‌వర్క్ బిజీ అంటూ చూపిస్తుండడంతో డబ్బు ట్రాన్స్‌ఫార్ చేయలేక ఇబ్బందులు పడుతున్నామని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కంబదూరులోని ఏపీజీబీ బ్యాంకును సంప్రదిస్తే... మంగళవారం సాయంత్రానికి ఈ సమస్య పరిష్కారమవుతుందని బ్యాంకు అధికారులు చెప్పినప్పటికీ ఏ మాత్రం పరిష్కారం కాలేదంటున్నారు.. యుపీఐ నెట్‌వర్క్ ఇష్యూ అని చూపుతూ రీ ఎంటర్ యూపీఐ పిన్ అంటూ ఫోన్‌పే, గూగుల్‌పేలో చూపుతోందని ఖాతాదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



దాతలను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

కళ్యాణదుర్గం (కంబదూరు), జూలై 30 : కంబదూరు మండల పరిధిలోని నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పలువురు పూర్వ విద్యార్థులు విరాళాలు అందించారు. మండలంలోని ఎగువపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఈడిగ సుధాకర్ ఆధ్వర్యంలో వారికి మంగళవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ... 1998-90 పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ. 40 వేలు అందజేసినట్లు తెలిపారు. వారిలో గుంతకల్లు డీఆర్ఎం ఆఫీస్ సూప రింటెండెంట్ గాజుల రామ్మోహన్ రూ. 15 వేలు, కాంట్రాక్టర్ మంగళకుంట నరసింహులు రూ. 10 వేలు, ఎరడికెర ప్రైమరీ స్కూల్ టీచర్ బాల రామ్మోహన్ రూ. 10,116, రాళ్లపల్లి స్కూల్ టీచర్ గురుమూర్తి క్రీడా పరికరాలకు రూ. 5 వేలు, వాటర్ ప్యూరిఫైడ్ యజమాని సుధాకర్, ఆగస్టు 15న పిల్లల బహుమతులకు అయ్యే ఖర్చు భరిస్తానని ప్రకటించారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సేవాఘడ్‌లో ఉచిత వైద్య శిబిరం

గుత్తి రూరల్, జూలై 30: మండలంలోని చేర్లోపల్లి వద్దనున్న సేవాఘడ్‌లో మంగళవారం సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్టు ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం ఉచితంగా ఖరీదైన వైద్యం అందిస్తామన్నారు. 400 మందికి వైద్య, రక్త పరీక్షలు నిర్వహించారు. ట్రస్టు సభ్యులు జగన్నాథ రావు, కేశవ నాయక్, అశ్వర్థ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పామిడి, జూలై 30 : మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ఏపీటీఎఫ్-257 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీ ఎఫ్ నాయకులు మాట్లాడుతూ... విద్యా వ్యవస్థకు శరఘాతంగా మారిన జీవో 117ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి చేసి ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియాలను సమాంతరంగా నడపాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. అదేవిధంగా 1998 - 2008 డీఎస్సీల ఎంటీఎస్ అభ్యర్థులను రెగ్యులర్ ప్రతిపాదికను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి సుంకప్ప, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, ఏపీటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు ఉజ్జినప్ప, అధ్యక్షుడు నూర్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జాకీర్ హుసేన్, మల్లికార్జున, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



పాలబావిలో గంబూషియా చేపలు వదులుతున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, జూలై 30: అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు గంబూషియా చేపలు ఎంతో దోహదపడతాయని, దోమల నివారణలో కీలకపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన మంగళవారం 35 వేల గంబూషియా చేపలను 13 నీటినిలువ కేంద్రాలలో వదిలే కార్యక్రమాన్ని, పట్టణంలోని పాలబావిలో ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బ్యాక్టీరియా వ్యాప్తి చెందకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా గంబూషియా చేపలను వదులుతున్నామన్నారు. ప్రజలు అంటువ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. దోమల లార్వా వృద్ధిచెందే నీటినిల్వ కేంద్రాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. మలేరియా అధికారి నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆయన పట్టణంలోని బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్ కోసం నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సకాలంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి, పేదలకు కడుపునిండా భోజనం పెట్టాలనే తమ లక్ష్యాన్ని నెరవేరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

బెళుగుప్ప: దోమలు ప్రబలకుండా గంబూషియా చేపలతో నివారించవచ్చ ని డాక్టర్ కార్తీక్ రెడ్డి, ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలోని నీటి కుంటలో మంగళవారం అధికారులు దోమల నివారణకు గంబూషియా చేపపిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, సర్పంచ్ రత్నమ్మ, టీడీపీ నాయకులు తిమ్మప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ పరిధిలోని ఐదుకల్లు రోడ్డుకు సమీపంలో ఉన్న సుబేదార్ చెరువులోకి మంగళవారం గంబుషియా చేపలను వదిలినట్లు మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డి తెలిపారు. ఈ చేపలు దోమల లార్వాలను ఆహారంగా తీసుకుంటాయని తెలిపారు. ప్రజలు కూడా రోడ్లపైకి నీరు వదలకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శుభకర రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి తిరుపాలయ్య, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నివారిద్దాం

రాయదుర్గం రూరల్, జూలై 30 : కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా లెప్రసీ నోడల్ అధికారి గంగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ కుష్టువ్యాధి నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ప్రోగ్రాం అధికారి నాగన్న, సీడీఎస్‌సీడీ ప్రోగ్రాం నోడల్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ నోడల్ అధికారి మాట్లాడుతూ... రాయదుర్గంలో ఎల్‌సీడీసీ ప్రోగ్రాం చాలా నెమ్మదిగా జరుగు తోందన్నారు. ఇప్పటివరకు 30 శాతం మాత్రమే పని జరిగిందని, మిగిలిన 70 శాతం కార్యక్రమాన్ని ఆగస్టు 2 లోగా పూర్తి చేయాలని ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నాలుగు లెప్రసీ కేసులు గుర్తించి ట్రీట్‌మెంట్ ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేంద్రప్రసాద్, సూపర్‌వైజర్ రామాంజినేయులు, డీపీఎంఓ నీలకంఠ, అజార్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన వైద్యాధికారి

బ్రహ్మసముద్రం, జూలై 30: మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌ను మంగళవారం వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంటగది, పరిసరాలను పరిశీలిం చారు. వసతి గృహ సిబ్బందితో మాట్లాడుతూ... వంట చేసేవారు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రతను, వంట పాత్రల శుభ్రతను పాటించాలని తెలిపారు. అలాగే పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించా లని తెలిపారు. వసతి గృహ పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నారాయణ, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను రద్దుచేయాలి

పంచాయతీరాజ్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రంగయ్య

యాడికి, జూలై 30: వలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రంగయ్య తెలిపారు. ఆయన మంగళవారం రాయలచెరువులో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.... సచివాలయాలు, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో గ్రామ పంచాయతీ సర్పంచులకు ఉన్న వివాదాలను తక్షణమే పరిష్కరించాలన్నారు. గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై గ్రామ పంచాయతీలకు సర్వాధికారాలు ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీల నుంచి గత ప్రభుత్వం లాగేసుకున్న నిధులను తిరిగి వాటి ఖాతాల్లో జమచేయాలని కోరు. గ్రామ వలంటీర్ల వ్యవస్థను వెంటనే రద్దు చేయాలని తెలిపారు. సమావేశంలో కమలపాడు సర్పంచు కంబగిరిస్వామి, వెంగన్నపల్లి ఉప సర్పంచు నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారుల కమిటీ ఏర్పాటు

ఉరవకొండ, జూలై 30: పట్టణంలోని కూరగాయల వ్యాపారుల అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణంలోని గవిమఠం ఆవరణంలో మంగళవారం కూరగాయల వ్యాపారులు సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా అయ్యప్పరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఓబులేశు, కార్యదర్శిగా మల్లన్న, కోశాధికారిగా కృష్ణ, గౌరవాధ్యక్షుడిగా ఓబులేశు, కార్యవర్గ సభ్యులుగా మరో నలుగురిని ఎన్నుకున్నారు. అలాగే ఆకుకూరల వ్యాపారుల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా లాల్‌స్వామి, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, మరో నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బొమ్మనహాళ్, జూలై 30: మండలంలోని దేవగిరిక్రాస్‌లో మంగళవారం హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగీ, చికున్‌గన్యా, మలేరియాలాంటి విషజ్వరాలు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రామలింగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహరం వేడుకలు



కరిగానపల్లిలో మొహరం వేడుకలకు తరలివచ్చిన జనం

కుందుర్పి, జూలై 29: మండల పరిధిలోని కరిగానిపల్లిలో మంగళవారం మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్లను ఉదయం గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం చావిడి ఎదుట ప్రత్యేక వేషధారణల్లో అలావ్ తొక్కారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. పీర్లకు చక్కెర చదివింపులు చేశారు.

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి గ్రామ కొత్తకాలనీలో మంగళవారం చిన్న పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. పీర్లు కొలువుదీరాయి. భక్తులు చక్కెర చది విం పులు చేసి, పానకాలు సమర్పించారు. బుధవారం జలధికి తీసుకెళ్తామని గ్రామస్థులు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయదుర్గం రూరల్, జూలై 30: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆర్డీటీ ఆర్డీ క్రిష్ణవేణి పేర్కొన్నారు. మండలంలోని పల్లేపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించారు. ఈ పోటీల్లో 200, 100, 60 మీటర్ల పరుగుపందెంలో గోనబావి విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. షాట్‌పుట్, లాంగ్‌జంప్ క్రీడల్లో మొదటి బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీఎల్ పుల్లారెడ్డి, హెచ్ఎం రఘురాం తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పల్లేపల్లి ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో జుంజురంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వంద మీటర్ల పరుగుపందెంలో లక్ష్మి, 60 మీటర్ల పరుగు పందెంలో సంధ్య మొదటి స్థానం, సోఫియా, వనజ రెండోస్థానం పొందారు. జయసుధ లాంగ్‌జంప్ రెండో స్థానం సాధించారు.